# ఈగలు

చదలవాడ

భోగలాలసత్వంతో మానవుడు పైమ రచి, మదించి, పట్టపగ్గాలు లేకుండా పాడైపోతాడని కాబోలు, ఈశ్వరుడు ఇహలోక సౌఖ్యాలతో బాటే ఈతి బాధలను కూడా కలిగించినాడు. వీనివల్ల కలిగే చికాకు ఇంతా అంతా కాదు. అందులో కొన్ని మన నిద్రాహారాల విషయంలోనే అడ్డు తగుల్తూ ఇబ్బందులు కలిగిస్తవి. "మొత్తనైతే నేమిరా, మరి చిత్తనైతే నేమిరా-అందుచేతను పాదుకట్టైను మెత్తనే చేతామురా" అంటూ మేను మెత్తమీదికి చేర్చేసరికి అంతకుముందే అక్కడ హాజరై వుండే మత్కుణం మనతోటి తన మేటి రక్తబాంధవ్యాన్ని వ్యక్తం చేసుకొంటూ, తన మక్కువను కూడా భుక్తం చేసుకుంటుంది. ఇంతకు మించింది ఈగ. "అన్నమైతే నేమిరా-మరి సున్నమైతే నేమిరా-అందుచేతను పాదుపొట్టకు అన్నమే చేతామురా" అంటూ ముద్ద నోటిదగ్గరకు తీసుకుపోయే సరికి అక్కడ వాలి, చేతికూడు నోటి కందకుండా చేస్తుంది ఈ ప్రాణి. అందువల్లనే 'ప్రథమకబళే మక్షికాపాతః' అనే వార్త కూడా పుట్టింది. చివరకు తన ప్రాణాన్ని పణంగా ఒడ్డైనా అడ్డం పడి (చచ్చి) వేడి వేడి కాఫీని మన నోళ్లలోకి వెళ్లనీకుండా చేస్తుంది ఈగ.

"కదిపితే కందిరీగల పుట్ట" అన్నట్లు పరిశీలించేకొద్దీ పలురకాల ఈగలు-వానిని గూర్చిన వార్తలు తేటతెల్లంగా తెలుసుకోవచ్చును. అటువంటి రకాలలో "జోరీగ" ఒకటి. ఒకానొక "జోరీగ తన పేరు మరచిపోయి తటస్థపడినవారినంతా తన పేరు చెప్పమని అడిగింది. అందరూ తమకు తెలియదంటూ మరొకరిని అడగమని సలహాలిచ్చారు. చివరకు గుర్రం మాత్రం "ఇంతేనా! నా చెవిలోని జోరీగవు కావా నీవు" అని పేరు జ్ఞప్తికి తెచ్చింది. కాబట్టి అటువంటి పోరపొచ్చెమీ జరుగకుండా, "ఇంతింత గాదయా" అనే శీర్షిక క్రింద తను [illegible]

రించిన జాబితాలో వేమన "ఇంటిలోని పోరు-కంటిలోని నలుసు, కాలిలోని ముల్లు చెప్పులోని రాయి" ఇత్యాదులతో చేర్చి "చెవులోని జోరీగ" అని అగ్రకుతో సహా పేర్కొన్నాడు.

"పై బటారం లో లొటారంగా" కాలం గడిపే వారి నిజస్థితి "ఇంట్లో ఈగల మోత, బైట పల్లకీల మోత"గా వుంటుంది. ఎటూ వెళ్లడానికి వీలు లేక సందిగ్ధంలో పడి కొందరు "శ్లేష్మంలో పడ్డ ఈగలాగ" కొట్టుకులాడుతారు. అటువంటి అవస్థనే ఆంగ్లంలో Fly in the Ointment అంటారు. తనలోని కుళ్ళు, కుత్సితం ఎదుటివాడు తటాలున అందరిముందూ బైట పెట్టేసరికి కొందరు ముఖం వేలాడవేస్తారు. అటువంటి ముఖాన్ని వర్ణించే సందర్భంలో అరవంలో "ముగత్తులే ఈ ఆడల్లే" అంటారు. "కత్తివాటు వేస్తే ముఖంలో నెత్తురుచుక్క లేదు." అనేదే ఆ మాటకు భావార్థం. కాలాన్ని దుర్వినియోగం చేయకుండా సదా పనిపాటల్లో మునిగి తేలేవాడిని As busy as a Bee అని ఆంగ్లంలో తేనెటీగలతో పోలుస్తారు. తద్భిన్నులను ఆ తేనెపట్టుల్లోనే వుండే "సోమరి ఈగలతో" పోలుస్తూ Lazy Drones అంటారు. ఇది గాక తేనెటీగలలో "రాణి ఈగ" అనేది ఒకటుంది. గ్రుడ్లు పెట్టడంతప్ప దీనికి వేరే పని వుండదు. "గ్రుడ్లు పెడుతూ కూర్చోవడం" మనలో కూడా చాలా మందికి మామూలే. అనగా ఏపనీ లేకండా కాలం వ్యర్థం చేయడం అన్నమాట. "నోట్లో ఈగ పోవడం కూడా తెలియక" కొందరు మొద్దు నిద్ర (బహుశా నోరు తెరుచుకొని) పోతారు. పూర్వపు రాణివాసాల్లో "పోతుటీగ" జొరబడడానికి కూడా వీలుండేది కాదు.

"ఈగలు కొట్టుకుంటూ కూర్చోవడం" • లే కూడా పని పాటలు లేకుండ, కాలం దుర్వినియోగం చేయడం అన్నమాట. అనగా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడం లాటిది. అదే భావంతోనే అరవంలోనూ "ఈ ఓట్టురదు" అని వాడుతారు. ఈ "ఈగలు కొట్టుకొంటూ కూర్చోవడం" అన్న ప్రయోగం ఎందుకొచ్చిందోగాని చైనా లో మాత్రం ఈగలు కొట్టి (చంపి) తెచ్చిన వారికి ఇంతో అంతో ప్రతిఫలం ముట్టుతుంది. ప్రభుత్వం ప్రోత్సహించడంవల్ల అక్కడ ఆరోగ్య వారాలు మక్షిక నిర్మూలన దినాలు విరివిగా జరుగుచుండడం మామూలు. ఏతత్సందర్భంలో ఈగలు చంపి తెచ్చిన వారికి పారితోషికాలివ్వడం అక్కడి అలవాటు. మన దేశంలోనూ ఈగలవల్ల వ్యాపించే వ్యాధులను తగ్గించదలచి ఈగలనిర్మూలనం సాగించబోయేటట్లు ఇటీవల వార్తలు రావడం ముదావహం. అనగా ప్రజలమీద "ఈగ వాలనివ్వని" ప్రయత్నాలు జరుగునన్నమాట.

మనం "సీతాకోక చిలుక" అని దేన్ని అంటామో దానికి ఆంగ్లంలో "Butter fly" అని పేరు. Dragon fly అంటే చైనీయులకు భక్తి. శుభ సూచకంగా, పవిత్రతా చిహ్నంగా, రక్షాకరంగా ఈ Dragon fly బొమ్మ వారు ఎక్కడబడితే అక్కడ చిత్రించుకొంటారు. పగటి పూటల్లో ప్రాణాలు తీయడం చాలక రాత్రిళ్లు కూడా కొన్ని ఈగలు దీపాల వెలుతురులో తబ్బిబ్బులు పడుతూ వుంటవి. అవి "గుడ్డి ఈగలు" అని అనడం మామూలు. కొన్ని ప్రాంతస్థులు దోమలను "చీకటీగలు" అంటారు.

"ఈగారిపాళెయం" అనే ఒక గ్రామం కూడా వుంది. కొంత చదువుకొన్న లక్షణాలు కనబరుస్తూ మాట్లాడ దలచినవారు ఆ వూరిని "ఈగావారి పాళెయం"అంటారు. ఈ "ఈగవారు" ఎవరు, వారి పేరిట ఊరు కూడా ఎందుకు వెలసిందన్నది పరిశోధకులు బైట పెట్ట వలసిన విషయం. కాని, ఆ పేరు రావడానికి కనీసం "ఈగవారు" అనే ఇంటి పేరుతో ఎవరైనా గొప్పవారు అక్కడ వుండే వుంటారని తోస్తుంది. "దోమావారు" అనే ఇంటిపేరు నేటికిన్నీ వుంటూవున్నప్పుడు "ఈగావారు" కూడా ఎందుకుండకూడదన్నదే పై ఊహకు ఆధారం. కాబట్టి "ఈగవారైనా" "ఈగావారైనా—" మొత్తానికి ఆ వూరికి ముఖ్య పురుషులు తెలుగువారే అన్నది మాత్రం తెలుసుకోవలసిన విషయం.

ప్రాత రికార్డులకు ప్రతులు తయారు చేయడానికి నియోగింపబడిన వ్యక్తి ఒకడు తలవంచుకు తనపని చేసుకుపోతూండి వచ్చుడు, కాగితాలమధ్య నలిగి చచ్చి అతు



గుమ్మడి పంట

(ఈ చిత్రమూ, ప్రక్క పేజీలో చిత్రమూ ఇటీవల మద్రాసు, సెంటినరీ హాలులో జరిగిన ఫొటోచిత్ర ప్రదర్శనంలో ప్రదర్శింపబడినవి. ఫొటోలు తీసినవారు. కృష్ణ చైతన్య)

## ★ ఈగలు ★

చచ్చిపోయిన ఈగ ఒకచోట కనిపించింది వెంటనే ఆ వ్యక్తి ఒక ఈగను వెంటాడి, వేటాడి చంపి మాతృకలో ఏ వాక్యంలో ఏ మాటకు దగ్గరగా ఈగ కనిపించిందో అక్కడే చంపిన ఈగను కూడా తను తయారు చేసిన ప్రతికి అంటించి True Copy అనే పేరును అక్షరాలా నిజం చేశాడు ఆనాటి నుండి "ఈ అడిచ్చాన్ కాపీ" అనే మాట సామెతగా పరిణమించి ఆ భాషకు అలంకార ప్రాయమై పోయింది

ఒక తెలుగువాడు ఒక తమిళ గృహస్థు నింటికి వెళ్ళి "ఈ మాట అట్ట పడిపుణ్ణి" న్నన్నాడు. తనకు తలదాచుకోవడానికి తావు చిక్కిన తర్వాత తీసుకుపోవచ్చునని తలంపుతో పాపం వాడి అభిప్రాయంలో తప్పు లేకున్నా ఆ తమిళ వ్యక్తి, "ఈ" అంటే ఈగ అని, "మాట" అంటే నల్లి అని, "అట్ట" అంటే జలగ అని, "పడిపుణ్ణి" అంటే పేనుపిడుజులు అని అపార్థం చేసుకొని ఆ మాట పనేమిరా దింపడానికి వీలు లేదంటూ తెలుగువాడి నెత్తిమీదనే పెట్టి పంపేశాడు. కారణం విపరీతార్థం చేసుకోవడం తప్ప మరేమీ లేదు. ఈ రీతిగానే హృదయాలు అర్థం చేసుకోక ఎడర్థం పెడర్థాలతో వుండినందువల్లనే చివరకు తెలుగువారు నెత్తి కెత్తుకొన్న మూటా ముల్లె కష్టంతో కర్నూలుకు తీసుకుపోవలసి వచ్చిందేమో

ఒక విధంగా వుంటూనే ఒక్కొక్క భాషలో ఒక్కొక్క అర్థం కలిగించి, అందువల్ల అపార్థం చేసుకోవడానికి దోహదం కలిగించే మారుమూల మాటలకన్నా ఎక్కువగా అన్ని భాషల్లోనూ ఒకే అర్థం ఇచ్చే పదాలే ఎక్కువగా నున్నవి అవన్నీ పండితులు పరిశోధించి ప్రజలముందు పెట్టి భాషా వైషమ్యాలు పోగొట్టడానికి ప్రయత్నిస్తేనే, "చెట్టపట్టాల్ పట్టుకొని — దేశస్థులంతా నడవవలెనోయ్ — అన్నదమ్ముల వలెను జాతులు — మతములన్నీ మెలగవలెనోయ్" అన్న గురజాడవారి లక్ష్యం సిద్ధించడానికి వీలు కలుగుతుంది సాహిత్యంయొక్క సత్ప్రయోజనం కూడా అదే ★

---

**సవరణ**

గతవారం సంచికలో అట్టు మొదటి కవరుపేజీలో ఫొటో తీసినవారు శ్రీ పి రామారావు, రెండవ కవరు పేజీలో ఫొటో తీసినవారు శ్రీ పి గురుమూర్తి అని గ్రహించ ప్రార్థన —సం॥